# అవమానం

-గుజ్జెటి గణేష్

"అమ్మో... అమ్మో... వీడి తల పగలా, వీడి నోరు పడిపోను! ఎంత మాట అన్నాడు. వీడికి నాలాంటి అక్కా చెల్లెళ్ళూ, కూతుళ్ళూ లేరేమో! నా మీద కన్నేసిండు..." అని లబోదిబో మంటోన్న రాజమ్మను చూసి దారినపోయే జనం క్షణాల్లో గుమికూడారు.

ఆమె అలా ఎందుకు తిడుతోందో ఎవరికీ అంతుపట్లేదు. అందరూ ఆశ్చర్యంగా రాజమ్మను చూస్తూండి పోయారు.



అంత మందిలో ఎవరునోరెత్తి కారణం అడగక పోయేసరికి రాజమ్మకు ఒళ్ళు మండింది. అందర్నీ కోపంతో తేరిపార చూస్తూ...

"ఏంటయ్యా! అలా బెల్లంకొట్టిన రాయిల్లా నోరెళ్ళబెట్టి చూస్తున్నారు! మీరేం మగాళ్ళయ్యా! పట్టపగలు... ఒక ఆడకూతుర్ని అవమానించి అన్యాయం చేస్తుంటే నాటకం చూసినట్లు గుడ్లప్పగించి చూస్తున్నారు!" అంటూ గయ్యిన లేచింది.

ఆమె మాటలు ఆ జనంలోని ఓ శాస్త్రిపై ప్రభావం చూపాయి. ఆయన వెన్నలా కరిగి, అగ్గిలా భగ్గుమన్నాడు.

వెంటనే ముందుకొచ్చి "ఏం జరిగిందమ్మా? నిన్నెవరు అవమానించారు?" అడిగాడు.

రాజమ్మ సిగ్గుతో తలొంచుకొని వచ్చే దుఃఖాన్ని అతి ప్రయాసతో ఆపుకొని ఆయన చెవిలో అసలు విషయం చెప్పింది.

ఆమె చెప్పిన మాటలు విని ఆ శాస్త్రి ఉగ్రరూపం దాల్చాడు. రాజమ్మకు జరిగిన అవమానం గూర్చి ప్రక్కనున్న వారితో చెప్పాడు.

అంతే! మరు నిమిషంలో అందరూ కట్టకట్టుకుని ఒక్కసారి బట్టల వ్యాపారి మార్వాడి మదన్‌లాల్‌పై విరుచుకు పడ్డారు.

"అరే... జరా మేరా బాత్ సునో..." అని అతడు మొత్తుకుంటున్నా ఎవరూ వినిపించుకోలేదు.

క్షణాల్లో మదన్‌లాల్ ఒళ్ళు హూనమైంది. ఒంటిమీద బట్టలు పీలికలై వ్రేలాడసాగాయి. ఇక అక్కడుంటే జనం ప్రాణాల్తో వదలరన్న భయంతో మదన్‌లాల్ కొట్టువదిలి జనాన్ని తప్పించుకొనిపారిపోయాడు.

అయినా, రాజమ్మ మనస్సు శాంతించలేదు. గ్రామ పెద్దలముందు పంచాయితీ పెట్టించి మదన్‌లాల్‌కు జరిమానా విధించాలని పట్టుబట్టింది.

మదన్‌లాల్‌పై వ్యక్తిగతంగా, వ్యాపార పరంగా కక్షగట్టి ఉన్న కొందరు రాజమ్మ మాటకు మద్దతు పలికారు.

"ఔనూ... పంచాయతీ పెట్టి జరిమానా వేయిస్తే మరోసారి ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేయడు" అన్నారు.

"బంగారం లాంటి భార్యను ఇంట్లో పెట్టుకొని... పరాయి ఆడదానిపై ఇదేం మోజు గాడిదకొడుక్కి" అని తిట్టారు.

"ఇలా ఒకడికి శిక్షపడితే... మరొకడు బుద్ధితెచ్చుకుంటారు. ఈ ఊరు బాగుపడ్తుంది" అని తీర్మానించారు.

మర్నాడే పంచాయతీ పెట్టి రాజమ్మనూ, మదన్‌లాల్‌నూ గ్రామపెద్ద ముందు నిలబెట్టారు.

గ్రామపెద్ద "ఏం జరిగిందమ్మా?" అని రాజమ్మను అడిగాడు.

రాజమ్మ పైట కొంగు భుజాలనిండా కప్పుకుని తలవంచుకుని నిలబడిపోయింది. తనకు జరిగిన అవమానాన్ని చెప్పడానికి ఆమెకు నోరు రావడం లేదు.

ఆమె పరిస్థితిని గ్రహించిన గ్రామ పెద్ద మదన్‌లాల్ రాజమ్మను నోటితో చెప్పలేనంతగా అవమానించి ఉంటాడని అర్థం చేసుకున్నాడు.

మదన్‌లాల్‌ను కోపోద్రేకంగా చూసి, తిరిగి రాజమ్మను చూస్తూ "చెప్పమ్మా! నువ్వేమీ భయపడకు. నీకు న్యాయం జరిగేట్టు చూసే పూచినాది" అని ధైర్యం చెప్పాడు.

గ్రామపెద్ద అన్న మాటకు రాజమ్మకు ధైర్యమేకాదు, మార్వాడీకి విధించే జరిమానా తాలూకు డబ్బు కూడా వస్తుందన్న ఆశ కలిగింది.

అందుకే దీనంగా చేతులు జోడించి "అయ్యా! నేను ఒక రవిక గుడ్డ కొనుక్కుందామని ఈ మార్వాడీ కొట్టుకి వెళ్ళానయ్యా! నేను వెళ్ళే సరికి కొట్లో ఈ మార్వాడీ ఒక్కడే ఉన్నాడు. ఒక రవిక ముక్కనుచూపించి ధర ఎంత? అని అడిగానయ్యా! 'దాని ధర పదిమీద ఒకటి' అని చెప్పాడయ్యా! నేను 'తొమ్మిదికి ఇవ్వ'మని బేరమాడాను. అంతే... నా వంక అదోలా చూసి 'ఇష్టమయితే ఒక మాట చెప్తా... దా పంద్రా... అయితే ఇచ్చేస్తా' అన్నాడండి!" అని చెప్పి సిగ్గుతో తలొంచుకుంది రాజమ్మ.

ఆమె మాట వింటూనే గ్రామపెద్దకు కోపం తారాస్థాయి నందుకుంది.

మదన్‌లాల్ వంక గుర్రుగా చూస్తూ "ఆమె చెప్పింది నిజమేనా? నువ్వామాట అన్నావా?" గద్దించాడు.

మదన్‌లాల్ వినయంగా చేతులు జోడించి "జీ... సాబ్ ఆమె చెప్పింది నిజం! నేను ఆ మాటే అన్నానూ... ఇందులో నాదే తప్పు ఉందో చెప్పండీ!" అన్నాడు.

గ్రామపెద్ద ఉగ్రరూపం దాల్చాడు "గాడిద కొడకా! అంత మాటనీ, ఆడకూతుర్ని అవమానించీ... పైగా తప్పేముంది అంటావా! ముందు వెయ్యి రూపాయల జరిమానా అక్కడిపెట్టు" అని గర్జించాడు.

గ్రామ పెద్ద మాటటూ, కోపాన్ని బట్టీ మదన్‌లాల్‌కు అసలు విషయం అప్పుడు బోధ పడింది. అతనిలోని భయం క్షణాల్లో మటుమాయమైంది.

'రామ్... రామ్... రామ్...! ఆ అమ్మాయి నాకీ కన్నబిడ్డ లాంటిది... అంతా మాటా అంటనా సాబ్! ఆ అమ్మాయి బ్లౌజ్ పీస్ బేరమాడి తొమ్మిదికి అడిగితే... నాకు తెలుగు బరాబ్బర్ రాక హిందీ మాటలో 'దహ పంద్రా' అంటే... పదీ రూపాయల పదిహేను పైసలు అయితే ఇస్తాను అని చెప్పాను. ఆ అమ్మాయికి హిందీ రాదు పాపం... నాదీ మాటని తప్పుగా అనుకుంది. అమ్మతోడు సాబ్! దేవుని మీద ఒట్టు! నాది మాటా నమ్మండి సాబ్!" అని తనకు వచ్చీరాని తెలుగులో గ్రామపెద్దకు చెప్పాడు మదన్‌లాల్.

అతని మాటలు విన్న గ్రామపెద్దకు విషయం పూర్తిగా అర్థమైపోయింది. అంతే... ప్రక్క నున్న మిగతా పెద్దలకు విషయాన్ని వివరించి గ్రామపెద్ద పక పక నవ్వేశాడు.

*గమనిక:*

*'పందురా' అంటే తెలంగాణాలో 'రా పడుకో' అని అర్థం.*

గుజ్జేటి గణేష్
కండక్టర్ ఇ. నెం. 302252
ఎ.పి.ఎస్. ఆర్.టి.సి. డిపో,
ఆర్మూర్.




డా॥ శివ, బషీరాబాద్, మోర్తాడ్ (గ్రామం), నిజామాబాద్ జిల్లా - 503 225.